క్లుప్తంగా

పేదల ఆరోగ్యమే లక్ష్యం



మందులు అందజేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కుక్కునూరు: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కుక్కునూరు సర్పంచ్ రావు మీనా వినోద్ తెలిపారు. శుక్రవారం గ్రామ సచివాలయం-2 పరిధిలోని నల్లకుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి జగనన్న పేదలకు మెరుగైన వైద్యాన్ని చేరువ చేశారన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్, సూర్ల అనిల్ కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం రోడ్డులో రూ.1.72 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్ శ్రీనివాసతో కలిసి నాణ్యతలో లోపాలు లేకుండా రోడ్డు నిర్మాణం జరగాలని, అధికారుల పర్యవేక్షణలో రోడ్డు వేయాలని ఏఈ సంధ్యారాణిని ఆదేశించారు. రోడ్డుకు ఎక్కడ డ్యామేజ్ వచ్చిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. చైర్‌పర్సన్ వెంట వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్ దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు బత్తిన చిన్న, పంది రాజా, గెద్దాడ శ్రీనివాసరావు, షేక్ అమీర్, కంచమర్తి సూర్యప్రకాష్, జహీర్ బేగ్ తదితరులు ఉన్నారు.

29న ధ్వజస్తంభ పునఃప్రతిష్ట



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ

టి.నరసాపురం: స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు మాట్లాడుతూ ఈనెల 29న ధ్వజస్తంభ పునఃప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే శివరాత్రికి ఐదు రోజుల పాటు ప్రతి ఏటా మాదిరిగానే ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్, వైద్యాధికారిణి జె.కల్పనా రాణి, విద్యుత్ శాఖ ఏఈ దాసరి శ్రీనివాస్, దేవరపల్లి ముత్తయ్య, సర్పంచ్ సునంద, ఆలయ, ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాత భాస్కరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శుక్రవారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన కుంట్ల భాస్కరరావు రూ.లక్ష, ఏలూరుకు చెందిన పీవీవీ నాగేశ్వరరావు రూ.లక్ష విరాళంగా ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజులు విరాళం బాండ్ పత్రాలను అందించి, వారి కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

కలెక్టర్‌ను కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అప్పారావు

ఏలూరు(మెట్రో) : జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కేశలి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పారావు బాలల హక్కుల పరిరక్షణ ప్రాంతీయ స్థాయి కన్వర్జెన్స్ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం ఏలూరు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

భక్తి ప్రపత్తులతో రథసప్తమి పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి రాజగోపురం వద్ద ఆవు పిడకలతో పొయ్యి ఏర్పాటు చేసి క్షీరాన్నం వండి భక్తులకు ప్రసాదంగా అందజేశారు. సూర్యప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించి సుదర్శన్ పెరమాళ్‌ను కోనేరు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగ ప్రసాదరావు, కంది బాలకృష్ణారెడ్డి, వాసవి సాయి నగేష్ పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని హైస్కూల్ ప్రక్కన గల శివాలయం నందు క్షీరాన్నం వండి సూర్య భగవానునికి భక్తులు నివేదన చేశారు. అనంతరం భక్తులకు చిక్కుడు ఆకుల్లో ప్రసాదంగా అందజేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, సత్య, మౌనిక, రమాదేవి, సత్యవతి, సామ్రాజ్యలక్ష్మి, జ్యోతి రమ్య, కుసుమ, ఆలయ అర్చకుడు కేశవ పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: రథసప్తమి పురస్కరించుకుని శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రజలు భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెంలోని మదన గోపాలస్వామి ఆలయంలో అర్చకుడు గుడిపూడి శేషాచార్యులు ఆధ్వర్యాన శ్రీ సూర్యనారాయణ స్వామివారికి మద్దిబోయిన శ్రీనివాస్, లక్ష్మీనరసింహాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బయ్యనగూడెం, కన్నాపురం, దిప్పకాయలపాడు, రాజవరం, పొంగుటూరు, గవరవరంలోని ఆలయాల్లో రథసప్తమి వేడుకలు జరిగాయి.



కొయ్యలగూడెంలోని సూర్యనారాయణ స్వామి

నూకాలమ్మ దేవస్థానంలో..

జంగారెడ్డిగూడెం: శ్రీ నూకాలమ్మ దేవస్థానంలో శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు 49 అడుగుల ఏకశిలా ధ్వజ స్తంభం వద్ద ఆవు పిడకలతో పొయ్యిపై పరమాన్నం వండి అమ్మవారికి, సూర్యభగవానునికి నివేదన చేసి భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి వెండి చీర తయారీకి వాడపల్లి గంగరాజు, వీరలక్ష్మి దంపతులు (బయ్యనగూడెం) 7తులాల వెండి, మాటూరి శ్రీనివాస్, శ్రీదేవి దంపతులు 5 తులాల వెండి, పెద్దింటి శివకుమార్, లోవకుమారి (ఏలూరు) రొంగల హేమ, చరణి కుటుంబ సభ్యులు 5 తులాల వెండి సమర్పించినట్లు చెప్పారు. ఈనెల 23న శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ యాగశాలలో 60వ చండీహోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పారిజాతగిరిలో సూర్యప్రభ వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెంలో శివాలయం వద్ద క్షీరాన్నం వండుతున్న భక్తులు

ఈ–పోస్ ద్వారా ఎరువులను కొనుగోలు చేయండి

చింతలపూడి: రైతులు ఈ–పోస్ యంత్రం ద్వారా ఎరువులను కొనుగోలు చేయాలని కేఆర్ పురం ఏడీఏ పీజీ బుజ్జిబాబు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక మండల వ్యవసాయాధికారితో కలిసి మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ–పోస్ ద్వారా ఎరువులు అమ్ముతున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఎరువుల పంపిణీ విధానంలో పారదర్శకత పాటించడం కోసం ఈ–పాస్ విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. రైతులు ఈ–పోస్ పద్ధతికి సహకరించాలని కోరారు. దుకాణదారులు తమ వద్ద ఉన్న ఎరువుల నిల్వలను బ్లాక్ బోర్డుపై తెలియజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుమతించిన ఎరువులను, వాటికి సంబంధించిన పత్రాలను లైసెన్స్‌లో నమోదు చేసుకుని వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు.



చింతలపూడిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏడీఏ బుజ్జిబాబు

నేడు ఎమ్మెల్యే బాలరాజు దంపతుల పర్యటన

కొయ్యలగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి దంపతులు శనివారం కొయ్యలగూడెం మండలంలో పర్యటిస్తారని పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు మంగదేవిపేటలో నూతన సచివాలయ భవనాన్ని, 10 గంటలకు దిప్పకాయలపాడులో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని, అనంతరం వేదాంతపురం, సరిపల్లిలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లకు వందనం, 3 గంటలకు చొప్పరామన్నగూడెంలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, 4 గంటలకు రాజవరంలో రైతు భరోసా కేంద్రాన్ని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను వారు ప్రారంభిస్తారని తెలిపారు.

నరసింహుని కల్యాణోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి వనితకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సర్పంచ్ ఏసుబాబు

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలకు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితను గ్రామ సర్పంచ్ పసుపులేటి ఏసుబాబు శుక్రవారం ఆహ్వానించారు. గోపాలపురం మండలం కరగపాడులో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న నరసింహుని కల్యాణోత్సవాల ఆహ్వాన పత్రికను ఆమెకు అందించారు. 22న ఉదయం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి తప్పకుండా రావాలని ఆమెను ఆహ్వానించారు. సర్పంచ్ వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు పసుపులేటి సాయిబాబు తదితరులు ఉన్నారు.

బోరు మోటార్ల పంపిణీ



బోరు మోటార్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలానికి మంజూరైన వైఎస్సార్ జలకళ పథకం ఉచిత బోరు మోటార్లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోర్సా పోచమ్మ, జెడ్పీటీసీ మల్లం వసంతరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జీలుగుమిల్లి-1, ములగలంపల్లి-2, తాటాకులగూడెం-2, వంకవారిగూడెం-5 చొప్పున మొత్తం 15 బోరు మోటార్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.44.69 లక్షలు ఉంటుందని, ఈ మొత్తాన్ని ప్రభుత్వం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా పార్వతి, మాజీ ఉప సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, కుంజా చిన్నరాయుడు, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా చెరువు భూమి కబ్జా

కొయ్యలగూడెం: యర్రంపేటలోని చెరువు భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. ఆక్రమించిన స్థలంలో దుకాణాలను ఏర్పాటు చేసుకుని కబ్జాదారులు లబ్ధి పొందుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికే సంత చెరువు ఆక్రమణకు గురికావడంతో శ్మశానం కూడా కుచించుకు పోయిందన్నారు. రోడ్డు పక్కనే దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడటంతో తరచూ వివాదాలు నెలకొంటున్నాయన్నారు. సంత చెరువు భూమిని ఒకరి తర్వాత మరొకరు ఆక్రమించుకుంటూ పోతున్నారని, దీనికి కొందరు ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా వంత పాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తుంటే అధికారులు పట్టించుకోకపోగా, కావాలంటే మీరు కూడా దుకాణాలు ఏర్పాటు చేసుకోండి అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించడంతో పాటు చెరువు భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



కొయ్యలగూడెం మండలం యర్రంపేటలో భూమిని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఘనంగా కంప్యూటర్స్ డే

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్స్ డే నిర్వహించారు. కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నేటి తరంలో అత్యంత ప్రాముఖ్యం కలిగిన పరికరం కంప్యూటర్ అని, నేడు ఉద్యోగాలన్నీ కూడా కంప్యూటర్ రంగంపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు ముందుకు దూసుకుపోతున్నాయని అన్నారు. కంప్యూటర్ విభాగాధిపతి జె.రాజా శ్రీకాంత్ మాట్లాడుతూ నేడు టెక్నాలజీ అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని, అభివృద్ధి దిశగా పరుగులు తీయాలంటే టెక్నాలజీ అనేది జీవితంలో చాలా అవసరమని, విద్యార్థులందరూ కూడా మక్కువతో టెక్నాలజీపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ బదరినారాయణ, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఎం.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

ఏలూరు(మెట్రో): సేవే పరమావధిగా పనిచేస్తోన్న స్వచ్ఛంద సంస్థలు అభినందనీయులని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం మానవత సంస్థ తలసీమియా బాధితులు 30 మంది ఉపయోగార్థం ల్యూకో సైట్ ఫిల్టర్ బ్యాగ్‌ల నిమిత్తం రూ.25 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సాటి మనుషులకు సేవలందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులలో అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. రూ.25 వేలు విరాళం అందించిన మానవత ఏలూరు యూనిట్ డైరెక్టర్ దీపక్, నెక్స్ జెన్ సంస్థ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యంను కలెక్టర్ అభినందించారు. మానవత సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, దేవినేని భాస్కరరావు, అడుసుమిల్లి నిర్మల, పీడీ రత్నాకరరావు, మేతర అజయ్ బాబు, అల్లూరి మోహిని తదితరులు పాల్గొన్నారు.



మానవత సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

అసాంఘిక శక్తులపై నిఘా

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలో అసాంఘిక శక్తులపై మరింత నిఘా పెంచామని సీఐ ఎం.ప్రభాకర్ అన్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో శుక్రవారం ఏలూరు టూటౌన్ పోలీసు అధికారులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా నిత్యం పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతమైన గనేబజార్ ప్రాంతంలో ఫుట్ పెట్రోలింగ్ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సమయంలో ఓటర్లకు సదుపాయాలు, భద్రత పరిస్థితులను సీఐ ప్రభాకర్ పరిశీలించారు. ఆయన వెంట ఎస్సైలు సాధిక్, రవితేజ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ బంద్ ప్రశాంతం



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం/కుక్కునూరు/కామవరపుకోట/ద్వారకా తిరుమల/పోలవరం రూరల్/చింతలపూడి/: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు మాదిగ భవన్ ప్రారంభం

ఏలూరు (టూటౌన్): భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మాదిగ భవన్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని చేతుల మీదుగా శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు నిర్మాణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మున్నుల జాన్ గురునాథ్, పొలిమేర హరికృష్ణ తెలిపారు. స్థానిక 49వ డివిజన్ జంగారెడ్డిగూడెం రోడ్డులో నిర్మించిన భవన్ ప్రాంగణంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. మూడున్నర దశాబ్దాలుగా మాదిగ కుటుంబాలలో వివాహాలు, ఇతర ఫంక్షన్ల నిర్వహణకు అనేక ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాని కమ్యూనిటీ హాలుకు స్థలంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే నిధులు ఇచ్చి నిర్మాణాన్ని పూర్తి చేయించారని వివరించారు. భవిష్యత్తులో ఈ భవన్‌ను పేద విద్యార్థులకు స్టడీ సర్కిల్‌గా, సమావేశాలకు ఫంక్షన్లకు ఉపయోగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానికి మాదిగల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలు, డప్పు కళాకారులు, చర్మకారులు, నాయకులు తరలి రావాలన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: మండలంలోని చింతంపల్లి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. దాడిలో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.